ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 153 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## దేశంలోనే తొలిసారి ప్రభుత్వ ఉద్యోగులకు
# రూ.కోటి బీమా

### ప్రభుత్వంపై, ఉద్యోగులపై రూపాయి భారం లేదు

**12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు.. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



దేశంలోనే తొలిసారి ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి బీమా పథకం తీసుకొచ్చామని ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై రూపాయి భారం లేకుండా అమలు చేస్తున్నామన్నారు. 12.91 లక్షల మంది ఉద్యోగులకు, పెన్షనర్లకు వర్తిస్తుందని చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు వివరించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024, జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసింది. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ..మిగతా 2లో

## బీఆర్ఎస్ కుట్రలను
# బలంగా తిప్పికొట్టాలి

### సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. ల "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.



# 22ఏ భూములపై చర్చకు డిమాండ్..

**మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్**

**చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు**

**అనుమతించపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు**

**మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో ..మిగతా 2లో

# సీఎం రేవంత్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీస్

**చర్యలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్**

**అసెంబ్లీ సెక్రటరీకి పిటిషన్ సమర్పించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి**

**కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు అసెంబ్లీలో ఫేక్ ట్వీట్ చదివారని గులాబీ నేతల ఆరోపణ**

**కాంగ్రెస్ ఐటీ సెల్ సృష్టించిన నకిలీ ఖాతాతో సభను తప్పుదోవ పట్టించారని మండిపాటు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు సభాహక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్ మోషన్) నోటీస్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు సమర్పించారు. తెలంగాణ అసెంబ్లీ వేదికగా చోటుచేసుకున్న ఫేక్ ట్వీట్ వివాదం మరింత ముదిరింది. మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ..మిగతా 2లో

## కేటీఆర్, హరీశ్ రావుపై
# లైంగిక వేధింపుల కేసు

**మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు**

**కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్**

**అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు**

**భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, ..మిగతా 2లో




## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి
# హైడ్రా వ్యతిరేకం కాదు

### హైడ్రా చీఫ్ రంగనాథ్

**సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి**

**అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు ..మిగతా 2లో



# సెక్రటేరియట్‌లోనే లంచం

**ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి**

**సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు**

**సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత**

**లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు**

2లో..

## సురక్షిత, శాంతియుత, సుస్థిర
# అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు



**అంతరిక్షం అందరిదీ.. బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి: ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ..మిగతా 2లో

## చైనా పోర్టులో
# ఘోర ప్రమాదం

**20 మంది మృతి**

2లో..



# దేశంలోనే తొలిసారి ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి బీమా

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని అన్నారు.

**జూన్ 25 నుంచి..**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపార పరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు



33 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**ఉద్యోగులకు రూ.1.20 కోట్లు**

ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**

తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగులకు హెల్త్‌కార్డు**

బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్‌ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని భట్టి విక్రమార్క శాసనసభకు చెప్పారు.

## చైనా పోర్టులో ఘోర ప్రమాదం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

చైనా పోర్టులో కార్గో నౌకలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో నౌకలోని 20మంది స్పాట్ లోనే మరణించారు. ప్రమాదం జరిగిన నౌక లైబీరియా జెండాతో ఉన్న ఓషియన్ మెలోడీ నౌకగా గుర్తించారు. ఈ నౌకను మరమ్మత్తుల కోసం పోర్టులో నిలిపివేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఉదయం 11.15గంటల ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్టు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు, మరణాలకు దారి తీసిన పరిస్థితులపై ఏజెన్సీ మొదట్లో వివరాలను వెల్లడించలేదు. మరోవైపు మరణాలపై కూడా ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. బోటులో మరికొందరు చిక్కుకుపోయి ఉండవచ్చని, లేదా గల్లంతై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదంపై స్పందించిన చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ గల్లంతైన వారి కోసం తక్షణమే గాలించాలని నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## 22ఏ భూములపై చర్చకు డిమాండ్..

**మొదటి పేజీ తరువాయి...**

సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్‌ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**మొదటి పేజీ తరువాయి...**

విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు.నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## సీఎం రేవంత్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీస్

**మొదటి పేజీ తరువాయి...**

ఉద్దేశపూర్వకంగానే నకిలీ ట్విట్టర్ ఖాతా పోస్ట్‌ను సభలో చదివారని బీఆర్‌ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి గురువారం అసెంబ్లీ సెక్రటరీ తిరుపతిని కలిసి ఈ మేరకు ఒక పిటిషన్ అందజేశారు. అసెంబ్లీ నియమావళి రూల్ 168 కింద ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోవాలని వారు తమ కంప్లైంట్‌లో డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న సభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సత్యదూరమైన విషయాలు మాట్లాడారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. బీఆర్‌ఎస్ 'ఇంటర్నేషనల్ సెక్రటరీ' సంధ్యారావు పేరుతో ఉన్న నకిలీ ఎక్స్ ఖాతాను ఆయన ప్రదర్శించారని మండిపడ్డారు. కేసీఆర్ ఆదేశాలతో దళితులు వచ్చిన తర్వాత ఇంటిని పసుపు నీళ్లతో శుద్ధి చేశామని అందులో ఉన్న ఫేక్ కంటెంట్‌ను సీఎం అసెంబ్లీ సాక్షిగా చదివి వినిపించారని గుర్తుచేశారు. అసలు తమ పార్టీలో 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవే లేదని బీఆర్‌ఎస్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఐటీ సెల్ సృష్టించిన ఈ నకిలీ ఖాతా పోస్ట్‌ను ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి క్రాస్ చెక్ చేసుకోకుండా చదవడం సభా హక్కులను ఉల్లంఘించడమేనని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవిత్రమైన చట్టసభలో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, ఫేక్ డాక్యుమెంట్స్ ప్రదర్శించి సభను తప్పుదోవ పట్టించిన రేవంత్ రెడ్డిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు.

## జాతీయ వేదికపై జలమండలి ఉత్తమ విధానాల ప్రజెంటేషన్

### పట్టణ నీటి భద్రతలో హైదరాబాద్ అనుభవాలను వివరించిన జేఎండీ మయాంక్ మిట్టల్




**హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

పట్టణ నీటి భద్రత, మురుగునీటి నిర్వహణలో హైదరాబాద్ జలమండలి అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, పరివర్తనాత్మక కార్యక్రమాలను జలమండలి జేఎండీ మయాంక్ మిట్టల్ జాతీయ వేదికపై వివరించారు. సెప్టెంబర్ 9న ముంబైలోని బాంబే ప్రదర్శన కేంద్రంలో ప్రారంభమైన ఐఎఫ్ఏటీ ఇండియా--2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. "ఒకే నీరు -- ఒకే నగరం -- ఒకే భవిష్యత్తు: వికసిత్ భారత్--2047 కోసం పట్టణ నీటి నిర్వహణకు పునరాలోచన" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జరిగిన "మెగా సిటీస్ వాటర్ అలయన్స్: పట్టణ నీటి భద్రతలో భారతీయ నాయకత్వం" ప్రత్యేక సమావేశంలో జలమండలి ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలపై మయాంక్ మిట్టల్ వివరణాత్మక సమర్పణ చేశారు. హైదరాబాద్ నగరంలో నీటి భద్రత, తాగునీటి సరఫరా బలోపేతం, మురుగునీటి శుద్ధి, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం, భూగర్భ జలాలు--వర్షపు నీటి సంరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ కోసం జలమండలి చేపడుతున్న చర్యలను వివరించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మెగా సిటీస్ వాటర్ అలయన్స్ (మహానగరాల జల కూటమి) లో హైదరాబాద్ సభ్య నగరంగా ఉంది. సుస్థిర నీటి నిర్వహణ, తాగునీటి సరఫరా విస్తరణ, మురుగునీటి శుద్ధి సామర్థ్యం పెంపు, వాతావరణ మార్పులను తట్టుకునే పట్టణ నీటి వ్యవస్థల అభివృద్ధి ఈ కూటమి ప్రధాన లక్ష్యాలు.

## రోడ్డు ప్రమాదంలో ఇన్ ఛార్జ్ ఏఈఓ నీలది శ్రీకాంత్ మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన నీలద్ది శ్రీకాంత్ (48) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొం దుతూ మృతి చెందారు. అయిజ పట్టణానికి చెందిన ఈయన (ఆగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్) లో పనిచేస్తున్నారు. ప్రస్తు తం ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామ ఇన్ ఛార్జ్ ఏఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం విధులు ముగించుకుని సాయంత్రం తన ద్విచక్రవాహనంపై అయిజకు భారత్ మాల రోడ్డు మీదుగా తిరిగి వస్తుండగ వెంకటాపూర్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పటంతో తీవ్రగాయాలు కావటం జరిగింది. చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం చనిపోయారు.. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమ పెళ్లి ఇష్టం లేక యువకుడి ఇల్లు ధ్వంసం

### రేపల్లె గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం.. జేసీబీతో ఇల్లు ధ్వంసం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



ప్రేమ పెళ్లిని అంగీకరించని యువతి కుటుంబ సభ్యులు ప్రియుడి ఇంటిపై దాడి చేశారు. జేసీబీతో ఇంటిని నేలమట్టం చేశారు. ఈ ఘటన గురువారం గద్వాల మండలం రేపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్లితే గద్వాల మండలం రేపల్లె గ్రామానికి చెందిన రంగముని, అదే గ్రామానికి చెందిన మహేశ్వరి ఇద్దరు ప్రేమించుకున్నారు. ఇటీవల కుటుంబ సభ్యులకు చెప్పకుండా హైదరాబాద్‌లో వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లి విషయం గురువారం గద్వాల మండలం రేపల్లి గ్రామంలో నివసిస్తున్న మహేశ్వరీ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆగ్రహానికి గురయ్యారు. గురువారం రంగముని ఇంటిని జేసీబీతో పూర్తిగా కూల్చివేసి ధ్వంసం చేశారు. ఈ దాడితో బెంబేలెత్తిపోయిన బాధిత కుటుంబ సభ్యులు గద్వాల పోలీసులను ఆశ్రయించారు. రంగముని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన అనంతరం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఉద్రిక్తతలు తలెత్తకుండా గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ శ్రీకాంత్, కళ్యాణ్ కుమార్ , పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉండగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రంగమునితో, బీసి సామాజిక వర్గానికి చెందిన మహేశ్వరీ ని కులాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో జీర్ణించుకోలేక యువకుడి ఇల్లుము ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపించారు.

# సెక్రటేరియట్‌లోనే లంచం

**ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి**

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు**

**సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత**

**లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్‌ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్‌ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

**మొదటి పేజీ తరువాయి...**

హరీశ్‌రావు సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్‌ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### సురక్షిత, శాంతియుత, సుస్థిర

# అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు

**మొదటి పేజీ తరువాయి...**

ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు.

'శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది. వాతావరణ పరిస్థితుల అంచనా నుంచి పంటలు, సముద్రాలు, ప్రజల జీవనానికి సంబంధించిన అనేక అంశాల్లో అంతరిక్ష విజ్ఞానం కీలకంగా మారింది. అంతరిక్ష రంగంలో అవకాశాలు అపారమని, అదే సమయంలో బాధ్యత కూడా అందరిదే. కక్ష్యల్లో ఉపగ్రహాల సంఖ్య పెరుగుతున్న వేళ, సాంకేతికత మరింత శక్తిమంతంగా మారుతున్న సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' అనే భావనపై ఆధారపడి ఉంది. 'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్' అనే స్ఫూర్తి ఇక భూగ్రహాన్ని దాటి అంతరిక్షానికి కూడా విస్తరించాలి.

అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి' అని ప్రధాని మోదీ సూచించారు.

**రైతుల నుంచి మత్స్యకారుల వరకు ఇస్రో సేవలు**

భారత్ అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేంద్రబిందువుగా ఉందని ప్రధాని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. ఇస్రో సాంకేతికతలు కేవలం అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సంబంధిత సమాచారం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి అనేక రంగాలకు అవి ఉపయోగపడుతున్నాయని వివరించారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కుపైగా ఉపగ్రహాలు అంతరిక్షంలోకి వెళ్లాయని ప్రధాని తెలిపారు. ఇస్రో సాంకేతికతలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తున్నాయని చెప్పారు.

**2035లో భారతీయ అంతరిక్ష కేంద్రం**

2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ తెలిపారు. 2040 నాటికి భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించే పురోగతి ప్రయోజనాలు మానవాళి మొత్తానికి చేరాలన్నదే తమ మార్గదర్శక సూత్రమని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ అంతరిక్ష విజయాలను ప్రస్తావించారు ప్రధాని మోదీ. చంద్రయాన్-3 మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీప ప్రాంతంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య-ఎల్1 మిషన్ సూర్యుడి రహస్యాలను ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. గతేడాది ఓ భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారని గుర్తుచేశారు.

**ప్రైవేట్ రంగానికీ పెద్దపీట**

ఇస్రోతో పాటు దేశంలోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. వ్యాపార సంస్థల ఉత్సాహం, ఇస్రో సాంకేతిక నైపుణ్యంతో కలుస్తుండటంతో భారత అంతరిక్ష రంగంలో కొత్త శక్తి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇస్రోకు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న విశ్వాసం వెనుక తరతరాల భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కఠోర శ్రమ ఉందని ప్రధాని కొనియాడారు. ఒక్కో మిషన్ విజయంతో వారు ఇస్రోకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. భారత్ అంతరిక్ష కార్యక్రమం ప్రారంభమైన 1960ల నుంచే ఫ్రాన్స్ విశ్వసనీయ భాగస్వామిగా ఉందని మోదీ తెలిపారు. భూ పరిశీలన నుంచి ఆధునిక సాంకేతికతల వరకు ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని మానవాళి ప్రయోజనాలతో అనుసంధానిస్తూ భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్ తదుపరి అంతరిక్ష ప్రయాణంలో ఫ్రాన్స్‌తో పాటు ప్రపంచ దేశాలు 'సహ ప్రయాణికులు'గా మారాలని ఆహ్వానించారు.

# దొరలకు ఎదురి తిరిగి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ

**బుద్వేల్, సెప్టెంబరు 10 (ప్రభాత ఉదయం)**

నా భూమి నేనే దున్నుతా...శిస్తు కట్టను... వెట్టి చేయను అని 1940వ సంవత్సరంలో దొరలకు, రజాకార్లకు ఎదురు తిరిగి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జె రుద్రకుమార్, సీఐటీయు రాజేంద్రనగర్ మండల కార్యదర్శి బచ్చలకూర స్వామి లు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బుద్వేల్ బన్సీలాల్నగర్ చౌరస్తా లో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పండిన పంటలో సగం దొర తీసుకునే రోజులలో, ఇంటి పన్ను, గొర్రె పన్ను, మేక పన్ను అంటు దొరలు వసూలు చేసే రోజులలో కమ్యూనిస్టుల సహకారంతో వారికి ఎదురు తిరిగి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు బుద్వేల్ యూనియన్ నాయకులు యాదయ్య, రంగస్వామి, మొగిలి క్రిష్ణ, నర్సింగ్రావు, సం జీవ, దాసరి ఈశ్వర్, ఈ స్వామి, దాసరి శంకర్, బుజ్జమ్మ, లక్ష్మీ, శంకరమ్మ, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుద్వేల్ బన్సీలాల్ నగర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం, సీ ఐ టీ యూ నాయకులు

**రజక సంఘం ఆధ్వర్యంలో.....**

దొరలకు వ్యతిరేకంగా పోరాడిన వీర నారి చాకలి ఐలమ్మ ఈ నాటి మహిళలకు ఆదర్శం అని రజక సం ఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీధర్, యువ నాయకులు పెండ్యాల సాయి మల్లిక్ లు అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బుద్వేల్ బన్సీలాల్ నగర్ చౌరస్తాలో ఆమెను గురు చేసుకుంటు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పెం డ్యాల పాండు, పెండ్యాల వెంకటేశ్, పెండ్యాల కుమార్, జి బాలకిషన్. పి వెంకటేశ్, పి కుమార్, జి సాయి కిరణ్, జ్ఞానేశ్వర్, శ్రీను, వికాస్, అరుణ్, మురళి, మహేశ్, బాస్కర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బుద్వేల్ రజక సంఘం నాయకులు







## జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు కోసం ఢిల్లీకి బయలుదేరిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు

**రాజేంద్రనగర్,సెప్టెంబర్10(ప్రభాత ఉదయం)**

అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ ఢిల్లీకి బయల్దేరారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి,జగదీశ్‌రెడ్డి,పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ వాణిదేవి ఢిల్లీకి వెళ్లారు.అసెంబ్లీ ప్రాంగణంలో వారి మీద జరిగిన దాడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్,జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నారు.ఘటనకు సంబంధించిన వివరాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.అసెంబ్లీ వద్ద మాజీ మంత్రులు,బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా కర్కశంగా వ్యవహరించిన పోలీస్ యంత్రాంగం సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకొని అమానుషంగా ప్రవర్తించారు.అంతటితో ఆగకుండా నలుపు రంగు చీర ధరించి అసెంబ్లీకి వెళ్తున్న సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారు.ఖాకీల దౌర్జన్యంతో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అసెంబ్లీ ముందు కంటతడి పెట్టుకున్న దృశ్యాలు వీడియోలో వైరల్ అయిన విషయం తెలిసిందే.





ఐఐఆర్ఆర్‌ను సందర్శించిన ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పీ వీ సత్యనారాయణ

## వరి పరిశోధనలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

**బుద్వేల్, సెప్టెంబరు 10 (ప్రభాత ఉదయం)**

వాతావరణ మార్పుల నేపథ్యంలో వరి సాగు లో నూతన వం గడాలను కనుగొనడంలో రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) చేస్తున్న కృషి అభినందనీయమైనదని ఆంధ్రప్రదేశ్ లోని ఆచార్య ఎనీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి వి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన ఐఐఆర్ఆర్ ను సందర్శించారు. ఐఐఆర్ఆర్ లో వరి సాగు విధానం, వరి లో నూతన వంగడాల గురించి ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఐఐఆర్ఆర్ లో కనుగొన్న వరి వంగడాలు నేడు దేశంలోని అనేక రాష్ట్రాలలో సాగవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. విదేశాలకు ఎగుమతి అయ్యే రకాలను సైతం ఐఐఆర్ఆర్ కనుగొని దేశ ఆర్థిక రంగంలో ముందుకు వెళ్లే విదంగా పనిచేయడం సంతోషకరమన్నారు. రైతాంగానికి ఉపయోగపడే అనేక రకాల వరి విత్తనాలను కనుగొని వారికి అందిం చడంలో రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ చేస్తున్న కృషి ని యావత్తు దేశ ప్రజలు అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ నీరజ, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ లాహో, డాక్టర్ సోమ శేఖర్. డాక్టర్ అక్షయ్, డాక్టర్ టూటి లు పాల్గొన్నారు.





## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన రమాదేవిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

### రంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రమాదేవి

**బుద్వేల్, సెప్టెంబరు 10 (ప్రభాత ఉదయం) :**

రంగారెడ్డి జిల్లా స్థాయి లో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన గణేశ నగర్ మండల ప్రజా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ని గురువారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రమాదేవి పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల పట్ల చూపుతున్న ప్రేమ, విధ్యాభోధన లో వారు చూపుతున్న ఆసక్తి అభినందనీయమన్నారు. పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునే గణేశనగర్ మండల ప్రాథమిక పాఠశాల అభివృద్ధి లో రమాదేవి పాత్ర ఎం తో ఉందన్నారు. సన్మానించిన వారిలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సుధ, కౌండిన్య, రాజశేఖర్ గౌడ్, రోహిణి, సరోజ, సంతోష, శరత్ బాబు, మహేశ్వరీ, మీనాక్షి లు ఉన్నారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి ఆలయానికి సీసీ కెమెరాలు అందజేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 3వ వార్డు హమాలీ కాలనీలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి ఆలయ భద్రత నిమిత్తం శక్తి సెక్యూరిటీ సిస్టం అధినేత జె శ్రీకాంత్ మూడు సీసీ కెమెరాలను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్ , ఆలయ కమిటీ నిర్వాహకులు శక్తి సెక్యూరిటి సిస్టం అధినేత శ్రీకాంత్ ను శాలువాతో సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గంగాధర్ రెడ్డి, టైలర్ శ్రీనివాసులు, వెంకట్రాములు, జనార్ధన్ గౌడ్, పి. వెంకట్రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.







## రహదారిపై గుంతలు పూడ్చిన కేటీదొడ్డి పోలీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం మైలగడ్డ స్టేజ్ సమీపంలో రాయచూర్ కు వెళ్లే రహదారిపై ర్యాలంపాడు 104 ప్యాకేజి కాలువ సమీపంలో ప్రధాన రోడ్డు గుంతలుపడటంతో ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. దీంతో గురువారం కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు పోలీసులు, మైలగడ్డ గ్రామానికి చెందిన కుషాలు, రమేష్, చంద్రశేఖర్ సహకారంతో ఎర్రమట్టి తెప్పించి గుంతలు పడిన చోట రోడ్డుపై మట్టి పోసి పూడ్చారు.అనంతరం రోడ్డును జేసీబీతో చదును చేశారు. పోలీసులు చొరవ తీసుకుని రోడ్డు మరమ్మత్తు చేయించడంపై స్థానికులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గద్వాలలోని పాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉప్పేర్ పిహెచ్ సి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉప్పేర్ పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఓ రవీందర్ మాట్లాడుతూ... మానసిక ఒత్తిడి, కుంగుబాటుతో బాధపడే వారికి సమాజం అండగా నిలవాలని సూచించారు. సరైన సమయంలో ధైర్యం చెప్పి, అవసరమైన కౌన్సెలింగ్ మరియు వైద్య సహాయం అందించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, తోటివారి మానసిక ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం “మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇద్దాం - జీవితాన్ని కాపాడుదాం” అనే నినాదంతో సిబ్బంది అందరితో ఆత్మహత్యల నివారణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు శ్యాంసుందర్, లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు , ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ కు వినతిపత్రం అందజేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గద్వాల్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ కు వినతిపత్రం సమర్పించారు. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు,సభ్యులు, యాజమాన్యం మాట్లాడుతూ రైస్ మిల్లర్స్ లపై పెనాల్టీలు, అధిక వడ్డీ భారంతో ఆర్థికంగా నష్టపోతున్నామంటూ మండిపడారు. రైస్ మిల్లర్స్ ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వాయించాలి అని అన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అక్టోబర్ 30 వరకు మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసి బియ్యం డెలివరీలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి అని షార్ట్‌ఫాల్ పేరుతో పెనాల్టీలు విధిస్తే రాష్ట్రంలో మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. రైస్ మిల్లులపై ప్రభుత్వం చేపడుతున్న ఫిజికల్ వెరిఫికేషన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మ, తదితరులు పాల్గొన్నారు.





## మహిళ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### పటాన్ చెరులో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

గడీలపై గళమెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన 41వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుడ్డెందొడ్డి నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫేజ్ -1 లో నిర్మించిన గుడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.19 టిఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం 1.19 టి ఎం సీ నుంచి 1.19 టి ఎం సీ కి రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు నిర్ణయం తీసుకుంది.మోడల్‌లో, సోలార్ పవర్ జనరేషన్‌తో అనుసంధానం చేసి ప్రాజెక్టు చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. సర్వేలు అధ్యయనాల కోసం రూ.15 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అదనంగా 1,100 ఎకరాల భూసేకరణకు రూ.165 కోట్ల నిధుల మంజూరు చేసింది. గూడెందొడ్డి సామర్థ్యం పెంపుకు, సర్వేల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో జిల్లా ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. సామర్థ్యం పెంపుతో ప్రాజెక్టు గుండెకాయలా మారనుందని సాగునీటి నిపుణులు చెబుతున్నారు. గూడెందొడ్డి జలాశయం సామర్థ్యం పెంపు వల్ల కలిగే ప్రయోజనాలు, ముంపు భూములు, గ్రామాలకు సంబంధించి సాగునీటి శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను ఇప్పటికే ఉన్నతాధికారులు అందజేశారు. దాని ఆధారంగానే డీపీఆర్ సర్వే చేసి 15 టీఎంసీల నీటి నిల్వకు ఇప్పుడు ముంపునకు గురైన భూములు కాకుండా మరో 1100 ఎకరాలు అవసరం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు అంచన వేస్తున్నారు.



**జీఓ కాపీని అందుకున్న గద్వాల ఎమ్మెల్యే**

గద్వాల నియోజకవర్గ పరిధిలోని గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 టి ఎం సీ ల నుండి 15 టి ఎం సీ లకు పంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ జీవో కాపీని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి అందజేశారు.గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపు ద్వారా నియోజకవర్గంలో



చివరి ఆయకట్టు వరకు రెండు పంటలకు సరిపడా నీరు అందించి, దాదాపు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది.గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లకు క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.గద్వాల నియోజకవర్గ రైతాంగ అభివృద్ధికి ప్రభుత్వం దూరదృష్టితో వ్యవహరించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తోంది అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో గద్వాలను రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో శ్రమిస్తాం అని ఈ సందర్భంగా మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు గద్వాల ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుంది

### అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు మల్లారెడ్డి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 10 (ప్రభాత ఉదయం)**




క్రీడలు విద్యార్థుల జీవితంలో చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు వివిధ రకాల క్రీడలలో పాల్గొనడం ద్వారా కలిగేటువంటి ఉపమనం చాలా గొప్పనైనదని స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో 70వ ఎస్ జి ఎఫ్ కొత్తపల్లి (హెచ్) మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ ఉ అథ్లెటిక్స్ అండర్ 14 , 17 బాలికల పోటీల ప్రారంభోత్సవానికి మండల విద్యాశాఖ అధికారి తమ్ము ఆనందంతో కలిసి వారు ముఖ్య అతిథిగా హాజరై అల్ఫోర్స్ విద్యాసంస్థల నిర్వాహకులు మల్లారెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులందరూ వివిధ రకాల క్రీడలను వివిధ సమయాల్లో పాల్గొని వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని పోటీతత్వాన్ని సైతం పెంపొందించుకోవాలని వారు సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడారంగానికి చాలా ప్రాముఖ్యత ఇస్తుందని క్రీడారంగాన్ని ప్రోత్సహించడంలో అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని వారు చెప్పారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి అల్ఫోర్స్ విద్యార్థులకు టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తున్నదని కావలసినటువంటి కోచింగ్ ఇస్తుందని వారు చెప్పారు విశిష్ట అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి ఆనందం మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్నవారు చదువులో కూడా హుషారుగా చదివి అగ్రగామిగా ఉంటారని చెప్పారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నిపుణులైన కోచ్ శిక్షణ ఇప్పించడం చాలా గొప్ప విషయమని , వివిధ స్థాయిలలో నిర్వహించబడుతున్నటువంటి వివిధ రకాల పోటీలకు చేయూతనివ్వడం జరుగుతుందని వారు చెప్పారుఇందులో భాగంగా నేడు పాఠశాలలో 70వ ఎస్ జి ఎఫ్ కొత్తపల్లి(హెచ్) మండల స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ అథ్లెటిక్ టోర్నమెంట్ అండర్ 14 , 17 బాలికల టోర్నమెంట్ ప్రారంభించడం జరిగిందని వారు చెప్పారు. ఈ టోర్నమెంట్లో నేడు సుమారు 400 మంది క్రీడాకారులు వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి విచ్చేసారు అని వారు చెప్పారు. అదేవిధంగా విచ్చేసిన వారందరికీ "అల్ఫోర్స్" భోజన వసతిని కల్పించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో బన్నీ లాల్ జిల్లా కార్యదర్శి, ఎస్ జి ఎఫ్, గిన్నె లక్ష్మణ్ , ఎస్ జి ఎఫ్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీఈటీలు ఎల్ వి రమణ, వి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, సుప్పు, ఓం ప్రకాష్, ప్రతినిధులు, వివిధ జట్ల మేనేజర్లు, కోచ్ లు, వివిధ పాఠశాలల ప్రతినిధులు , వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు



# గణేష్ నవరాత్రి ఉత్సవాలు.. భక్తి, సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీక

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 10 (ప్రభాత ఉదయం)**

శ్రీ విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే దేవుడని, జ్ఞానం విజయం, శుభారంభాలకు అధి దేవుడని, వివిధ సమయాల్లో వివిధ రకాల ద్రవ్యాలతో ఆరాధించబడతాడని, ముఖ్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడుతాయని పాఠశాల నిర్వాహకులు డాక్టర్ వి.వనజా నరేందర్ రెడ్డి కరీంనగర్ లోని ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఉ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినాయక చవితి పురస్కరించుకొని ముందస్తు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి గణనాథునికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అట్టహాసంగా శోభయమానంగా ప్రారంభించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ప్రతిష్ఠాపన ఉత్సవాల ప్రారంభంలో మట్టి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి, ప్రాణప్రతిష్ఠ, సంకల్పం, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలు నిర్వహిస్తారని వారు చెప్పారు. వివిధ పూజా కార్యక్రమాలు నవరాత్రుల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలను నిర్వహించడం ద్వారా ఉత్సవాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావడం జరుగుతుందని వారు తెలిపారు, ప్రధానంగా గణపతి హోమం, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం పంచామృత అభిషేకం, పుష్పార్చన,కుంకుమార్చన, ప్రసాద వితరణ, అన్నదానం చేయడం చాలా పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు,ప్రతిరోజూ సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. గణేష్ నవరాత్రుల్లో పిల్లలు, యువత మరియు మహిళల ప్రతిభను ప్రోత్సహించే వేదికగా కూడా వాడుకుంటారని చెప్పారు సాంస్కృతిక కార్యక్రమాలు,శాస్త్రీయ నృత్యాలు,జానపద నృత్యాలు,భక్తి గీతాలు,చిన్న నాటికలు,హరికథలు,కీర్తనలు,సంగీత కార్యక్రమాలు , తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు.పలువురు చిన్నారులు గణనాథుని వేషధారణలో విచ్చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య యువతకు వివాహ సంబంధాల ఏర్పాటుకు సహకరిస్తాం

### మంత్రి సీతక్క, కమిషనర్ శృతి ఓజ సానుకూల స్పందన

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

వివాహానికి సిద్ధంగా ఉన్న యువతులకు, ఆర్యవైశ్య యువకులకు వివాహ సంబంధాలు ఏర్పాటు చేసేందుకు గద్వాల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు సానుకూలంగా స్పందించినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ జీరో అవర్‌లో గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను, కమిషనర్,డైరెక్టర్ శృతి ఓజ ను కలిసి వినతి చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివాహానికి సిద్ధంగా ఉన్న యువతులకు, గద్వాల్ పట్టణ ఆర్యవైశ్య యువకులకు వివాహ సంబంధాలు ఏర్పాటుచేసేందుకు సహకరించాలని కోరారు.ఈ ప్రతిపాదనపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందిస్తూ, ఇలాంటి చక్కటి కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చిన గద్వాల్ పట్టణ ఆర్యవైశ్య సంఘాన్ని అభినందించారు. కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆసక్తి ఉన్న యువకుల పూర్తి వివరాలతో కూడిన బయోడేటాలను సిద్ధం చేసుకుని కొద్ది రోజుల్లో మరోసారి కలవాలని సూచించారు.అనంతరం మంచి రోజు చూసి వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహించి, సంబంధాలను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపడదామని మంత్రి సీతక్క పేర్కొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య యువకులు పాల్గొన్నారు.ఆసక్తి ఉన్న పట్టణ యువకులు తమ పూర్తి బయోడేటాతో సంప్రదించవలసిందిగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఆలూరు బిలకంటి రాము కోరారు.



కాటేదాన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంచిన పిటిఆర్ ను ప్రారంభిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు, ఆర్‌ఆర్ జోన్ సీఈ గోపయ్య ఎస్ ఈ రవి ప్రసాద్ లు

# విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంచుతున్నాం

### డైరెక్టర్ నరసింహులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులకు గురికాకుండా డిమాండ్ కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంపొందిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) నరసింహులు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో సబ్ స్టేషన్ పవర్ ట్రాన్స్ ఫార్మర్-1 12.5 ఎంవిఏ నుండి 16 ఎంవిఏ కు సామర్థ్యం పెంచిన పిటిఆర్ ను డైరెక్టర్ ఆపరేషన్ నరసింహులు, ఆర్‌ఆర్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఎల్ గోపయ్య, రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ రవి ప్రసాద్, రాజేంద్రనగర్ డి ఇ పి రత్నాకర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఇబ్బందుల గురికాకుండ ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గగన్ పహాడ్ సబ్ డివిజన్ ఏడిఈ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థినులకు ఉచిత రక్త పరీక్షలు

### ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 10 (ప్రభాత ఉదయం)**

నేటి బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శ్రీ సరస్వతి శిశుమందిర్ హై స్కూల్, కరీంనగర్లో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బాలాజీనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సి.బి.పి రక్త పరీక్షలకు సంబంధించిన నివేదికలను గురువారం విద్యార్థినులకు అందజేశారు.ఇటీవల 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు నిర్వహించిన ఈ రక్త పరీక్షల ద్వారా హీమోగ్లోబిన్ స్థాయి, ఐరన్ లోపం తదితర రక్త సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. నందికొండ శ్రీలక్ష్మి విద్యార్థినులకు వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించి, హీమోగ్లోబిన్ స్థాయిలు, ఐరన్ లోపం వల్ల కలిగే సమస్యలు, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ... ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు వైద్యుల సలహా తీసుకోవాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానాచార్య మోర రణధీర్ మాట్లాడుతూ... భవిష్యత్తులో కూడా లయన్స్ క్లబ్ సహకారం పాఠశాలకు కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, హనుమండ్ల రాజిరెడ్డి, బోయినపల్లి సరళ, మారంపల్లి గంగాధర్, రోడ్ల ప్రభాకర్ రెడ్డి, బిళ్ళ రాజయ్య, నరుగుల రమేష్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ఆదిశేషు, ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 10 (ప్రభాత ఉదయం)**

లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, జిల్లా 320జి ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల (సైన్స్ వింగ్) , కరీంనగర్‌లో పలు అవగాహన , సేవా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆత్మహత్యల నివారణ మరియు మానసిక ఆరోగ్య అవగాహన అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పోటీలో విజేతలకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత మరియు సమస్యలను ఎదుర్కొన్నప్పుడు తగిన సహాయం పొందాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ పొరండ్ల కిషన్, సైకియాట్రిస్ట్ , తెలంగాణ స్టేట్ ఐ.ఎమ్,ఎ అధ్యక్షులు, ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం, భావోద్వేగ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు , నిపుణుల సహాయం పొందడం, యువతకు సానుకూలమైన మరియు సహాయక వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాలను వివరించారు.శ్రీనివాస్ శ్రీరాముల కార్యక్రమ చైర్మన్‌గా వ్యవహరించగా, సింగమ రాజు కార్యక్రమ కో-చైర్మన్‌గా వ్యవహరించారు.అదేవిధంగా కళాశాల ప్రాంగణంలో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. లిపునర్వినియోగించదగిన క్లాత్ బ్యాగులను పంపిణీ చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మైదం శివకాంత్ పటేల్, కార్యదర్శి బట్టు వినోద్ పటేల్, కోశాధికారి మేతుకు కె. చైతన్య, జాయింట్ సెక్రటరీ ఐతా సూరజ్ , కోలా అన్నారెడ్డి తో పా.మానసిక ఆరోగ్య అవగాహన, యువతకు ప్రోత్సాహం, సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.




# గద్వాల పట్టణంలో వీధి కుక్కల దాడి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

గద్వాల మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు నల్లకుంట ప్రాంతంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల నల్లకుంటకు చెందిన కార్పెంటర్ వీరన్న చారి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్కల గుంపు ఆయనను వెంబడించి దాడి చేశాయి. ఈ ప్రమాదంలో ఆయన బైక్‌పై నుండి కిందపడిపోవడంతో భుజం ఎముక విరగడంతో పాటు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గతంలో కూడా ఇక్కడ అనేకమంది బాటసారులు కుక్కల దాడిలో గాయపడిన ఘటనలు ఉన్నాయి. గత మూడు నెలలుగా ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ వీధి కుక్కల సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు అని, కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేసి వదులుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఆపరేషన్ చేసే సెంటర్ నల్లకుంటలోనే ఉన్నప్పటికీ, ఆపరేషన్ పూర్తయిన కుక్కలను సురక్షితంగా దూర ప్రాంతాల్లో లేదా అడవుల్లో వదలకుండా, మళ్లీ నల్లకుంట నడిబొడ్డునే వదిలేస్తున్నారు. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఒక పరిహాసంగా తీసిపారేయడం అత్యంత విచారకరం.నేడు వీధి కుక్కలకు ఉన్న రక్షణ కూడా సాధారణ ప్రజలకు లేకుండా పోయింది అని కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నల్లకుంటలో భయాందోళన కలిగిస్తున్న కుక్కలను పట్టుకుని జనావాసాలకు దూరంగా వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**



గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామంలో కరెంట్ తీగలతో ప్రమాదం పొంచి ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శెట్టి ఆత్మకూరు గ్రామంలో విద్యుత్ తీగలు ఇండ్లకు అనుకొని పోవడంతో ఇండ్లపై ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నాయి. అంతే కాకుండా కరెంట్ తీగలు చేతికందేలా వేలాడుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టించుకో వలసిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్షంగా ప్రవర్తిస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని,, ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు చూస్తున్నారు తప్పితే ఎలాంటి పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వైర్లను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేజీబీవీలో బాలల హక్కులు, సైబర్ భద్రతపై విస్తృత అవగాహన సదస్సు

### బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**



కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, మాదకద్రవ్యాల నివారణ, సోషల్ మీడియా వినియోగం ,సైబర్ భద్రతపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల సంరక్షణాధికారి నరసింహులు మాట్లాడుతూ..విద్యార్థినులు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి ప్రవర్తన, నైతిక విలువలను అలవర్చుకుని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. బాలికలు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా బాలల సంరక్షణ అధికారుల దృష్టికి ధైర్యంగా తీసుకురావాలని సూచించారు.బాల్య వివాహాలు ఆడపిల్లల చదువును, ఆరోగ్యాన్ని మరియు భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని, వీటి నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు గానీ, లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు గానీ సమాచారం అందించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాలల సంరక్షణ చట్టాలు, అలాగే 'సురక్షిత స్పర్శ - అసురక్షిత స్పర్శ' అంశాలపై విద్యార్థినులకు క్షుణ్ణంగా వివరించారు. ఎవరైనా అసౌకర్యంగా ప్రవర్తిస్తే వెంటనే నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు.మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ, విద్యార్థులు వీటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అలాగే, సోషల్ మీడియాను పరిమితంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని.. తెలియని వ్యక్తులకు ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉంటూ సైబర్ భద్రత పాటించాలని తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, గ్రామ సర్పంచ్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, చైల్డ్‌లైన్ సిబ్బంది సరోజిని, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆర్టీఓ అధికారుల వేధింపులు... ఆందోళన చెత్తుతున్న వాహనదారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణ పరిధిలో ఆర్టీఓ అధికారుల వేధింపులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో ధరూర్ రోడ్డులోఆగి ఉన్న డీసీఎం వాహనానికి ఆర్టీఓ అధికారులు చలాన్ విధించడంతో స్థానిక వాహనదారులు, డ్రైవర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. "రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాలకు చలాన్లు ఎలా వేస్తారు? 'అంతా మా ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు" అని వాహనదారులు అధికారులను నిలదీశారు. అంతే కాకుండా పదే పదే చలాన్ లు విధించడంతో చేసిన కష్టం ఆంతా చలాన్ ల రూపంలో ప్రభుత్వానికి చెల్లిచాల్సి వస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. సమాధానం చెప్పలేక, అధికారులు కూడా తమ వద్ద ఉన్న ఫోన్లతో ఎదురు రికార్డింగ్ చేస్తూ వాహనదారులతో వాగ్వాదానికి దిగారు. ఆర్టీఓ అధికారుల గద్వాల పట్టణ పరిధిలో ఆర్టీఓ అధికారుల వేధింపులు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో ధరూర్ రోడ్డులోఆగి ఉన్న డీసీఎం వాహనానికి ఆర్టీఓ అధికారులు చలాన్ విధించడంతో స్థానిక వాహనదారులు, డ్రైవర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. "రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాలకు చలాన్లు ఎలా వేస్తారు? 'అంతా మా ఇష్టం' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు" అని వాహనదారులు అధికారులను నిలదీశారు. అంతే కాకుండా పదే పదే చలాన్ లు విధించడంతో చేసిన కష్టం ఆంతా చలాన్ ల రూపంలో ప్రభుత్వానికి చెల్లిచాల్సి వస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. సమాధానం చెప్పలేక, అధికారులు కూడా తమ వద్ద ఉన్న ఫోన్లతో ఎదురు రికార్డింగ్ చేస్తూ వాహనదారులతో వాగ్వాదానికి దిగారు. ఆర్టీఓ అధికారుల నియంతృత్వ ధోరణి నశించాలని డిమాండ్ చేశారు.నశించాలని డిమాండ్ చేశారు.

## జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

### శుభాకాంక్షలు తెలిపిన పట్వారీ శశిధర్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ "జయ శంకర్ కాలనీ ఫేస్2" లోని "జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు, కాలనీవాసులు అందరూ కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ని కాలనీలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ జయశంకర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి అభిప్రాయ భేదాలకు లేకుండా కలిసి పనిచేయాలని, కాలనీలో ఎటువంటి సమస్యలు కలుగకుండా చూసుకోవాలని కోరారు. నూతన కమిటీకి తన సంపూర్ణ సహకారం, మద్దతు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, "నూతన కమిటీ సభ్యులు, కాలనీ 'ప్రెసిడెంట్' కోమిరెడ్డి రాంరెడ్డి, 'జనరల్ సెక్రటరీ' కొండా రమేష్, 'వైస్ ప్రెసిడెంట్' ఆంబోతు దేవా నాయక్, మహమ్మద్ గఫూర్, 'క్యాషియర్' ఈశ్వర్, 'జనరల్ సెక్రటరీ' జక్కుల సురేష్, వి. శివశంకర్, కే.నరేష్, కాలనీవాసులు, మహిళలు, యువత, టీం పట్వారీ పాల్గొన్నారు.





## ప్రజల ఆస్తులను దోచి సీఎం సోదరుడికి కట్టబెట్టిన ప్రభుత్వం

**మహేశ్వరం, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను దోచిపెడుతూ భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి , రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి కలిసి రూ. 200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ. 7 కోట్లకే ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని, విలువైన భూములను నామమాత్రపు ధరలకు కట్టబెట్టడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అక్రమాలు, అవినీతి పరాకాష్టకు చేరాయని, ఈ భూ కేటాయింపులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అక్రమాలపై ప్రజాక్షేత్రంలో పోరాడుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కాటేదాన్, మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ గారు, గుమ్మడి కుమార్ గారితో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాము యాదవ్ , మైసీ రెడ్డి , రాఘవేందర్ యాదవ్ , రాజేష్ యాదవ్ , రామస్వామి , కొంపల్లి జగదీష్ , వెంకటరమణ , సునీల్ , అనిల్ , దుర్గా ప్రసాద్ , అశోక్ కుమార్ , సురేష్ , కృష్ణ ముదిరాజ్ , క్రాంతి ,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్కలగింపకు నిరంతరంగా పనులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10(ప్రభాత ఉదయం)**



మూసి నదిలో దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారిన గుర్రపు డెక్కను తొలగించే పనిని జిహెచ్ఎంసి అధికారులు యుద్ధ ప్రాతిపదికని చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా రెండు హిటాచి యంత్రాలను కొనుగోలు చేశారు. అత్తాపూర్ బ్రిడ్జి నుంచి బాపు ఘాట్ వరకు మూసీ నదిలో గుర్రపు డెక్కన్ తొలగించడానికి ఈ హిటాచి యంత్రాలను వాడుతున్నారు. గుర్రపు డెక్క తొలగించడంతోపాటు యాంటీ లార్వల్ ఆపరేషన్ను నిరంతరంగా కొనసాగించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి, జిహెచ్ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ రవి కిరణ్ స్థానిక అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ఆరోగ్య విభాగం అధికారి ధరావత్ సాగర్ పర్యవేక్షణలో గుర్రపు డెక్క ఆపరేషన్ కొనసాగుతున్నది. ఈ ప్రక్రియలో స్థానిక అధికారులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఐదు గోల్డ్ మెడల్స్ సాధించిన నిఖితకు ఆనంద్ కృష్ణారెడ్డి ఘన సత్కారం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, ప్రభాత ఉదయం:**

ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ కెమిస్ట్రీ విభాగంలో 85వ స్నాతకోత్సవం సందర్భంగా ఏకంగా ఐదు గోల్డ్ మెడల్స్ సాధించిన ఐడీఏ బొల్లారం ప్రాంతానికి చెందిన బేగంపేట నిఖితను బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. ఆటో డ్రైవర్ కుటుంబానికి చెందిన నిఖితను ఆయన బుధవారం ఆమె నివాసానికి వెళ్లి అభినందించి, శాలువాతో సన్మానించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నిఖిత ఐదు స్వర్ణ పతకాలు సాధించడం బొల్లారం ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. నిఖిత భవిష్యత్తులో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉత్తమ పరిశోధకురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి నిఖితను ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయం అందించేందుకు తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని నిఖితను అభినందించారు.

## ఓల్డ్ ఎంఐజీలో కూల్చివేతల డ్రైవ్

**పటాన్ చెరు సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**



అమీన్‌పూర్‌లోని భారతీనగర్ డివిజన్ పరిధిలో ఉన్న ఓల్డ్ ఎంఐజీ ప్రాంతంలో సంబంధిత అధికారులు కూల్చివేతల డ్రైవ్ చేపట్టారు. నిబంధనల అమలులో భాగంగా చేపట్టిన ఈ చర్యలు అమీన్‌పూర్ డీసీ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో కొనసాగాయి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టారు.నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ప్రణాళికా నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలు, అనుమతులకు సంబంధించిన అంశాలపై పరిశీలన అనంతరం వర్తించే నిబంధనల ప్రకారం కూల్చివేత చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ ప్రాంతంలో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మరిన్ని అంశాలు గుర్తిస్తే, ప్రభుత్వ మార్గదర్శకాలు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఉల్లంఘనలపై తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## వార్డు కార్యాలయంలో సొంత నిధులతో ఫ్యాన్లు

### ఏర్పాటు చేయించిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ వార్డు కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఆర్ ఐ) ప్రక్రియను మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలన కోసం వెళ్లిన తరుణంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారుల (బి ఎల్ ఓ) దుస్థితిని చూసి ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఫ్యాన్లు పనిచేయకపోవడం, ఉదయం నుండి సాయంత్రం వరకు విధులు నిర్వర్తించే బి ఎల్ ఓ లు కూర్చొని పని చేయడానికి సరిపడా కుర్చీలు, టేబుళ్లు, కనీసం త్రాగునీరు కూడా అందుబాటులో లేకపోవడాన్ని ఆయన స్వయంగా గుర్తించి చలించిపోయారు. అధికారులు పడుతున్న ఇబ్బందులపై తక్షణమే స్పందించిన తూము శ్రావణ్ కుమార్ బి ఎల్ ఓ ల కొరకు కుర్చీలు, టేబుళ్లను తక్షణమే ఏర్పాటు చేయించారు. మంచి నీటి సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా, వెంటనే తన సొంత ఖర్చుతో కొత్త ఫ్యాన్లు కొనుగోలు చేసి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాం, ఒగ్గు లింగం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ యువజన నాయకులు పి.ఆర్.నాయుడు

### న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసిన బాధితులు

### అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పి ఆర్ నాయుడుపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం


### బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేష్ గౌడ్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి యూత్ కాంగ్రెస్ నాయకుడు తనకు పార్టీలోని పెద్దలతో మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ, అమాయక ప్రజలను ఉద్యోగాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పేరిట, స్థలాల వివాదాలు పరిష్కరిస్తానని మోసం చేస్తూ లక్షల రూపాయలను వసూలు చేస్తున్నాడని కెపిహెచ్ బి కాలనీలో పలువురు బాధితులు రోడ్డుకు ఎక్కిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా కేపీహెచ్ బి కాలనీలో బాధితుడు దాసరి దుర్గారావు మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీ వ్యక్తి వద్ద తనకు రావలసిన 34 లక్షలు ఇప్పిస్తానని కెపిహెచ్ బి కాలనికి చెందిన ముత్తిరెడ్డి ఫణింద్ర (పి.ఆర్.నాయుడు) తనను నమ్మించి, ఫైనాన్స్ కంపెనీ వ్యక్తి తనకు ఇస్తానన్న స్థలాన్ని అక్రమంగా అతని పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. నాకు చెందాల్సిన స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నావని, తన రావలసిన డబ్బులు ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో బాధితుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... నగర శివారులో తాను కొనుగోలు చేసిన స్థలం కబ్జాకు గురి కావడంతో సమస్యను పరిష్కరిస్తానని ముత్తిరెడ్డి ఫణింద్ర (పి.ఆర్.నాయుడు) అనే వ్యక్తి తన వద్ద రూ. 2 లక్షల రూపాయలను తీసుకున్నాడని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో డబ్బులు అడిగితే ఏం చేసుకుంటావో... చేసుకో అని బెదిరిస్తున్నాడన్నారు. ముత్తిరెడ్డి ఫణింద్ర అతని డ్రైవర్ రాము పేరుతో రూ. 90 వేలు విలువ చేసే ఐ ఫోన్ కొనుగోలు చేసి ఇఎంఐలు కట్టకుండా రామును ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. బ్యాంక్ అధికారులు డ్రైవర్ రామును ఇఎంఐలు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. మరో బాధితుడు మాట్లాడుతూ తనకు టీ పాయింట్ ఇప్పిస్తానని చెప్పి 35 వేల రూపాయలను తీసుకున్నాడని ఆరోపించారు. అనంతరం బాలాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ పార్టీ పేరును అడ్డం పెట్టుకొని అమాయక ప్రజలను నమ్మిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పి ఆర్ నాయుడు పై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. పి ఆర్ నాయుడు వల్ల మోసపోయిన బాధితులు చాలా మంది ఉన్నారని, ఈ విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## కష్టాల్లో ఉన్న కుటుంబానికి బీజేపీ నాయకుడి చేయూత

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10( ప్రభాత ఉదయం)**



సిఎంసి 272వ డివిజన్ కేబీఆర్ కాలనీకి చెందిన బీజేపీ కార్యకర్త సురేష్ 2023లో అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలను మోస్తున్న ఆయన తల్లి తీవ్ర అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బొల్లారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.జే.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి వారి నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, పార్టీలు, కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఆనంద్ కృష్ణారెడ్డి సేవాభావాన్ని అభినందించారు. ఆయనకు, ఆయన కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు ఆకాంక్షించారు.



## విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో ఉపాధ్యాయులు బోధించాలి: అదన కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

జిల్లెలగూడ ఎంపీపీ ఎస్ లో విద్యా కార్యక్రమాల అమలును పరిశీలించిన అదనపు కలెక్టర్ డాక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి, బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి కృష్ణతో కలిసి సందర్శించి విద్యా కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న ప్రాథమిక అక్షరాస్యత , సంఖ్యాశాస్త్రం) , పరిహార తరగతులు, బేస్‌లైన్ నివేదిక, నెలవారీ దృష్టి కేంద్రీకరించే సామర్థ్యాలు తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.విద్యార్థుల అభ్యసన స్థాయిలు, హాజరు, తరగతి గది బోధనా విధానాలను పరిశీలించి, అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేలా బోధనా విధానాలను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ భోజనం నాణ్యత, పరిశుభ్రత, పౌష్టికాహార ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మరియు ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అధికారులు కొనియాడారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్థంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్థంతి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సునీల్, సంఘాల నాయకులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ క్రిష్టాపురం గ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లాలో జన్మించిందని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సంఘాల నాయకులు అన్నారు. ఈ భూమినాది, పండించిన పంటనాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు, నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు, అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రటైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని అన్నారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని తెలిపారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985న అనారోగ్యంతో మరణించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం ప్రెసిడెంట్ ఎం. అజయ్, కౌన్సిలర్ ఆంజనేయులు బి. సి. ఫ్రంట్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు, సంస్థాగత రుణాలు అర్హులైన వారికి చేరేలా సమన్వయంతో పనిచేయాలి:

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతిని, సెప్టెంబర్ 10 (ప్రభాత ఉదయం)**




రంగారెడ్డి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. ఆధ్వర్యంలో 2026--27 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సంస్థాగత రుణాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా సంబంధిత శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలను పెంపొందించేలా ఇప్పటికే అమలులో ఉన్న ఎం ఎస్ ఎం ఈ పథకాలను సమన్వయం చేస్తూ హైబ్రిడ్ పథకం రూపొందించేందుకు ఎల్ డి ఎం, ప్రాజెక్టు డైరెక్టర్ డిఆర్డిఏ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అర్హత కలిగిన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించే దిశగా విద్యా రుణాల మంజూరుపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు అందేలా బ్యాంకర్లు చొరవ చూపాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ సూచించిన కార్యక్రమాల అమలుకు అన్ని బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని, సంస్థాగత రుణాలు సరైన అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సమన్వయంతో పనిచేయాలని ఎన్ డి ఎం రంగారెడ్డి సుశీల్‌కుమార్ కె.పి. బ్యాంకర్లను కోరారు.సమావేశంలో నాబార్డ్, ఆర్బిఐ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సమ్మిళితం , వెనుకబడిన వర్గాలకు రుణ సదుపాయాల విస్తరణ, క్రెడిట్ డెలివరీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.జిల్లా సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సాధికారత, సమ్మిళిత వృద్ధి సాధనకు అన్ని శాఖలు, బ్యాంకులు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608